సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


డాక్టర్ తరుణి

చాదర్‌ఘాట్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఓల్డ్‌మలక్‌పేట యూపీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ తరుణి అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిల్వ ఆహార పదార్థాలను తినరాదని సూచించారు. ఎలాంటి అనారోగ్య సమస్యలున్నా సొంత వైద్యం చేయకుండా బస్తీ దవాఖానా, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు.

ప్యూరో నాచురల్ ఉద్యోగి ఔదార్యం


నందినిని సన్మానిస్తున్న స్టోర్ యాజమాన్యం

దిల్‌సుఖ్‌నగర్: నిత్యవసరాలు కొనుగోలు చేసేందుకు స్టోర్‌కు వచ్చిన వినియోగదారుడి బంగారు ఉంగరం పడిపోగా అందులో పనిచేసే సిబ్బంది అందజేసి తన ఔదార్యాన్ని చాటుకుంది. ఆర్‌కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని ప్యూరో నాచురల్‌కి సరుకులు కొనడానికి వచ్చిన ఓ వినియోగదారుడి బంగారు ఉంగరం అక్కడే పడిపోయింది. గమనించిన ఉద్యోగి నందినికి ఆ ఉంగరాన్ని యాజమాన్యానికి అందజేసింది. ఇంటికి వెళ్లిన తర్వాత చూసుకున్న వినియోగదారుడు వెంటనే స్టోర్‌కు వచ్చి ఈ విషయం చెప్పగా వెంటనే అతడికి ఉంగరం అందజేశారు. నిజాయితీతో ఉంగరాన్ని ఇచ్చిన నందినిని నిర్వాహకులు సన్మానించి రూ. 5 వేల నగదు బహుమతిని అందజేశారు.

డివిజన్ అభివృద్ధికి కృషి


ఫుట్‌పాత్ పనులు ప్రారంభించిన కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: ప్రణాళికాబద్ధంగా ఐఎస్‌సదన్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. సింగరేణి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఫుట్‌పాత్ నిర్మాణ పనులను గురువారం ఆమె కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. అనంతరం సింగరేణి కాలనీ రోడ్ నెంబర్-14లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ స్థలం వద్ద ఏర్పాటు చేయనున్న ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మధుకర్‌రెడ్డి, ప్రశాంత్, వెంకటరమణ, శైలజ, జయలక్ష్మి, ఆనంద్, బాలు నాయక్, వినోద్ పాల్గొన్నారు.

వీడ్కోలు


వెంకటేశ్వరరావుకు వీడ్కోలు పలుకుతున్న సిబ్బంది

చైతన్యపురి: బదిలీపై వెళ్తున్న చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావుకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. పది నెలల పదవీ కాలంలో తనకు సహకరించిన ఎస్‌ఐలు, స్టేషన్ సిబ్బందికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. విధులు సక్రమంగా నిర్వహించి మంచి పేరు తేవాలని కోరారు.

ఇన్‌స్పెక్టర్‌గా సైదులు..



చైతన్యపురి ఇన్‌స్పెక్టర్‌గా సైదులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న కె.సైదులును చైతన్యపురి ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేస్తూ రాచకొండ సీపీ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు కాపాడటం, ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చూస్తామని సైదులు తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక



మన్సూరాబాద్: ఎల్‌బీనగర్‌కు చెందిన వీల్‌చైర్ క్రికెటర్ దివ్యాంగుడు ధరవత్ సురేష్ గురువారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. దివ్యాంగ క్రీడాకారుల సమస్యలపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేశామని ఈ సందర్భంగా సురేష్ పేర్కొన్నాడు.

పగటి పూటా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

- హడలెత్తిపోతున్న మందు బాబులు
- చంపాపేట పరిధిలో 15 రోజుల్లో 105 కేసులు నమోదు


చంపాపేట చౌరస్తాలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

చంపాపేట: ఒకప్పుడు కేవలం రాత్రి సమయంలోనే డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు గత 15 రోజులుగా రాత్రీపగలు తేడా లేకుండా మందుబాబులకు చుక్కలు చూపిస్తున్నారు. తనిఖీల్లో పట్టుబడితే భారీ జరిమానాలతో పాటు జైలుకు పంపుతుండటంతో కొందరు ఉదయం మద్యం తాగేందుకు జంకుతున్నారు. గతంలో ట్రాఫిక్ పోలీసులు ఓ నిర్దిష్టమైన స్థలాన్ని ఎంచుకుని అక్కడ మాత్రమే డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసులు ఏ రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తారోనని మందుబాబులకు దడ పుడుతోంది. రహదారిపై రెడ్ సిగ్నల్ పడ్డ సమయంలోనూ బ్రీత్‌ఎనలైజర్స్‌తో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అంతర్గత రహదారుల్లోనూ..

సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంపాపేట డివిజన్ ప్రాంతంలో డీఎంఆర్, ఐఎస్ సదన్, చంపాపేట, కర్మన్‌ఘాట్, మందమల్లమ్మ, మారుతీనగర్ సాయిమందిర్ చౌరస్తాలలో పాటు ప్రధాన రహదారి కాలనీ అంతర్గత రహదారులు అని తేడా లేకుండా ప్రతీ చోట వాహనదారులను బ్రీత్ ఎనలైజర్స్‌తో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు ముమ్మరం చేస్తున్నారు. ఇది గమనించని కొందరు మందుబాబులు తమ వాహనాలను అక్కడే వదిలి పారిపోతున్నారు. మద్యం తాగితే ఇంట్లో ఉండండి వాహన నడిపితే జైలుకు వెళ్లటం ఖాయం అంటూ మద్యం మత్తులో వాహనాలను నడిపేవారిని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. గతంలో వాహనదారులు పెండింగ్ చలాన్లకు భయపడేవారు. కానీ ప్రస్తుతం వాహనదారులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలకు బెంబేలెత్తిపోతున్నారు. పోలీసులకు చిక్కటం ఎందుకు మద్యం తాగి వాహనం నడపకపోవటమే మంచిదని వాహనచోదకులు భావిస్తున్నారు.


కారు డ్రైవర్‌కు బ్రీత్‌ఎనలైజర్‌తో పరీక్షలు నిర్వహిస్తున్న సీఐ ఆసిఫ్

అవగాహన కార్యక్రమాలు..

మద్యం తాగి వాహనం నడపటం వల్ల కలిగే అనర్థాలపై ట్రాఫిక్ పోలీసులు ఆటో, బస్, వ్యాన్ డ్రైవర్లతో పాటు ద్విచక్ర వాహన చోదకులకు చౌరస్తాలో అవగాహన కల్పించటంతో పాటు పాఠశాలలు, కళాశాలలోని విద్యార్థులకు రోడ్డు భద్రత, నియమాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. చంపాపేట డివిజన్ పరిధిలో గత 15 రోజులుగా నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలలో 105 మందిపై కేసులు నమోదు చేశారు. అందులో ఐదుగురికి జైలుశిక్ష, మరో 17 మందికి రూ.2000 నుంచి 3500 వరకు జరిమానా కూడా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

వాహనదారుల భద్రత కోసమే..



గతంలో రాత్రి వేళల్లో మాత్రమే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునేవి. ప్రస్తుతం పగటి వేళల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. రహదారి వినియోగదారుల భద్రత కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్దిష్టమైన స్థలం అంటూ లేకుండా ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఎక్కడ పడితే అక్కడ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రతీ ట్రాఫిక్ పోలీసు వద్ద బ్రీత్‌ఎనలైజర్ ఉంచుతున్నాం.

–మహ్మద్ ఆసిఫ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

అర్హుల గుర్తింపునకు ఇంటింటి సర్వే

- రేషన్‌కార్డుల దరఖాస్తుదారుల వివరాల సేకరణ
- మలక్‌పేట సర్కిల్–1లో సర్వేకు సిద్ధం
- ఈ నెల 10లోపు పూర్తి చేయాలని ఆదేశాలు


ఓల్డ్‌మలక్‌పేటలో ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు

చాదర్‌ఘాట్: రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకొన్న వారిలో అర్హులను గుర్తించేందుకు ఈనెల 10 లోపు ఇంటింటికి సర్వే చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మలక్‌పేట సర్కిల్–పరిధలోని మూసారాంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట, అజంపురా, ఛావుని, సైదాబాద్, అక్బర్‌బాగ్ పరిధిలో ఉన్న 84 రేషన్ దుకాణాల పరిధిలోని దరఖాస్తు దారుల ఇంటింటికి సర్వే కోసం 40 బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ప్రతి రోజు తమకు కేటాయించిన దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పూర్తి వివరాలు పరిశీలించి సంబంధిత అధికారికి రిపోర్ట్ చేస్తారు.

15600 దరఖాస్తుదారులు..

ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలన, మీ సేవా కేంద్రాలు, వార్డు కార్యాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. అర్హులైన వారికి లబ్ధి చేకూరగా వారందరికి గత నెల నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. మూడు నెలల నుంచి మీ సేవా కేంద్రాల ద్వారా మలక్‌పేట సర్కిల్–1లో దాదాపు 15600 దరఖాస్తులు అందాయి. జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయనున్నారు. జీహెచ్‌ఎంసీ ఇప్పటికే 40 మంది ఉద్యోగులను ఈ సర్వే కోసం కేటాయించగా వారంతా రేషనింగ్ మలక్‌పేట సర్కిల్ పౌర సరఫరాల శాఖ అధికారి నర్సింగ్‌రాజుకు రిపోర్ట్ చేశారు. తాజాగా చేపట్టిన ఇంటింటి సర్వేలో అర్హులను గుర్తించి కొత్త కార్డులు మంజూరు చేయనున్నారు.

లక్ష్యసాధనకు ఇష్టంతో చదవాలి


విజయలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మలక్‌పేట: లక్ష్య సాధన కోసం విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలని మలక్‌పేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. విజయలక్ష్మి అన్నారు. పదవీ విరమణ సందర్భంగా స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు విజయలక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, గురువుల మాటలకు లోబడి ఉండాలని సూచించారు. పదవీ విరమణ చేసినప్పటికీ విద్యార్థులకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

బాగ్‌మూసారిమో ఉన్నత పాఠశాలలో..

మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని బాగ్‌మూసారిమో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరునగరి రాధాకృష్ణ గురువారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. సైదాబాద్ డిప్యూటీ ఈవో, హెచ్‌ఎంగా రాధాకృష్ణ అందించిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో అంజనేశ్వర్‌రావు, మందడి వెంకట్‌రెడ్డి, పి. వెంకట్‌రెడ్డి, వెంకటేష్, సతీష్, శ్రీవాణి పాల్గొన్నారు.

గుర్తింపు లేని ఇనిస్టిట్యూట్లను రద్దు చేయాలి


ఇనిస్టిట్యూట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి నాయకులు

మలక్‌పేట: పారా మెడికల్ విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులను మోసగిస్తున్న గ్రీన్ ఫీల్డ్, సిమ్స్ ఇనిస్టిట్యూట్లపై చర్యలు తీసుకోవాలని జేఎస్‌టీయూహెచ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సందీప్ డిమాండ్ చేశారు. మూసారంబాగ్‌లోని ఇనిస్టిట్యూట్ వద్ద విద్యార్థులతో కలిసి గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని నెలలుగా గ్రీన్ ఫీల్డ్, సిగ్మా, సిమ్స్ పేర్లతో బీఎస్సీ పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామని, తెలంగాణ పారామెడికల్ బోర్డు ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తామని, నమ్మించి విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వ నిబంధనలు, యూజీసీ మార్గదర్శకాలు లెక్క చేయకుండా ఇతర రాష్ట్రాల ప్రశ్న పత్రాలు, హాల్ టికెట్లు వాడుతూ తెలంగాణలో పరీక్షలు నిర్వహించడం నేరపూరిత చర్య అన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని విద్యా మాఫియాను అడ్డుకోవాలని, బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో పవన్, విష్ణు, తేజ, ప్రేమ్‌కుమార్, కార్తీక్, మమత, శృతి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

దృష్టి మరల్చి ఆభరణాలు తస్కరిస్తున్న ఇద్దరి రిమాండ్

సైదాబాద్: తమ ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని వారి దృష్టి మరల్చి బంగారు ఆభరణాలు తస్కరిస్తున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. సైదాబాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వివరాల ప్రకారం.. యంజాల్‌కు చెందిన రైతు మోహన్‌రెడ్డి గత నెల 10న ఐఎస్‌సదన్ చౌరస్తాలో యంజాల్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. అయితే ఆటోలో ఒక వ్యక్తి అటు ఇటు కదులుతూ ఇబ్బంది పెడుతుంటే ఆటోను చంపాపేట వద్ద ఆపి అతడు దిగిపోయాడు. కాసేపటి తర్వాత చూసుకుంటే తన మెడలోని 17 గ్రాముల బంగారు గొలుసు కనపడలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు హఫీజ్‌బాబా నగర్‌కు చెందిన మహ్మద్ ఖలీద్ (26), ఎండీ ఫిరోజ్ (30)లను అదుపులోకి తీసుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు. ఇరువురు ఇదే తరహా పహాడీషరీఫ్, అత్తాపూర్ పీఎస్‌ల పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. వారి నుంచి చోరీకి ఉపయోగించిన ఆటో, 14 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నట్లు డీఐ తెలిపారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు

టమాటా రూ.39, వంకాయ రూ.23, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ.50, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.35, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.15, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.28, మునగ రూ.28, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.23, కీర రూ.23, బీన్స్ రూ.75, క్యాప్సికమ్ రూ.50.

ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

5 నుంచి పారా అథ్లెటిక్స్ పోటీలు

మన్సూరాబాద్: తెలంగాణ పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 5 నుంచి 2వ పారా సబ్ జూనియర్, జూనియర్ ఛాంపియన్‌షిప్ పోటీలను గచ్చిబౌలిలోని అథ్లెటిక్స్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గడిపల్లి ప్రశాంత్ తెలిపారు. గురువారం ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని జిల్లాలోని 19 సంవత్సరాల లోపు దివ్యాంగ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పరుగు పందెం, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో, లాంగ్ జంప్, క్లబ్‌తో విభాగాల్లో పోటీలు ఉంటాయని ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఆగస్టు 22 నుంచి ఫరీదాబాద్‌లో జరిగే సబ్ జూనియర్స్, జూనియర్స్ జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 9000683937 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మొసలి సంచరించే ప్రాంతానికి వెళ్లొద్దు


ఫారెస్ట్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీ ఆనుకుని వున్న మూసీ నది సమీపంలోకి ఎవరూ వెళ్లవద్దని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఫణిగిరి కాలనీ శివాలయం సమీపంలో మొసలి సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళనలు గురవుతున్న నేపథ్యంలో గురువారం ఆయన ఫారెస్ట్ అధికారులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. ఎవరూ నీటిలోకి వెళ్లకుండా బారికేడ్లు అడ్డం పెట్టించారు. మూసీ నది మధ్యలో ఉన్న శివాలయం వద్దకు ఎవరూ వెళ్లవద్దని, గడ్డి కోసేందుకు వెళ్లకుండా ఉండటం మంచిదన్నారు. మొసలిని బంధించి వేరే ప్రాంతానికి తరలించాల్సిందిగా ఫారెస్ట్ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట విఠల్‌రెడ్డి, మహేశ్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అజయ్, ప్రభు, శ్రీనివాస్, రామకృష్ణ, గణేష్ పాల్గొన్నారు.

రాజీవ్ స్వగృహ వద్ద ఆందోళన


ఆందోళన చేస్తున్న దరఖాస్తుదారులు

లింగోజిగూడ: నాగోలు డివిజన్ బండ్లగూడలోని రాజీవ్ స్వగృహలో ఇళ్ల కేటాయింపులో అవకతవకాలు జరిగాయని గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం హయత్‌నగర్ సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. బుధవారం తీసిన డ్రాలో ఇళ్లు వచ్చిన దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు తెలియజేస్తామని చెప్పి వివరాలను తెలియకుండా నెంబర్లు బ్లాక్ చేశారని ఆరోపించారు. దరఖాస్తుదారులకు కాకుండా అధికారులు తమకు ఇష్టం వచ్చిన వారికి కేటాయించారని వెంటనే ఇళ్ల కేటాయింపుపై విచారణ జరిపి చర్యలు తీసకోవాలని డిమాండ్ చేశారు. ఇళ్లు కేటాయించిన వారి జాబితాను ఆన్‌లైన్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు.

పరిశుభ్రత నగరంగా మార్చుదాం


స్థానికులతో మాట్లాడుతున్న హేమంత్ కేశవ పాటిల్

మన్సూరాబాద్: ఆరోగ్య, పరిశుభ్రత నగరంగా మార్చుదామని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్ అన్నారు. వర్షాకాలం దృష్ట్యా నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణపై చేపడుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని గురువారం ఆయన మన్సూరాబాద్‌లోని ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డు, సిందూర్ హైరేంజ్ అపార్ట్‌మెంట్ వద్ద కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమిషనర్ నేతృత్వంలో ప్రత్యేక మాన్సూన్ డ్రైవ్ చేపడుతున్నామని ఈ డ్రైవ్‌లో నిర్మాణాల కూల్చివేత వ్యర్థాలు, పూడిక తీత వ్యర్థాలను తొలగిస్తున్నట్లు స్పష్టం చేశారు. దోమల నివారణపై ఎంటమాలజీ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


మొక్క నాటుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, కాలుష్య నివారణకు చెట్లు దోహదపడుతాయని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారి డివైడర్‌లో గురువారం ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పోచమ్మ దేవాలయ చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పవన్‌రెడ్డి, నాయకులు సురేష్, సంతోష్ పాల్గొన్నారు.

నియామకం


జగన్మోహన్‌రెడ్డి

మన్సూరాబాద్: రెడ్డి జాగృతి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా మన్సూరాబాద్ డివిజన్ పరిధి హయత్‌నగర్‌కు చెందిన గజ్జ జగన్మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్ట శ్రీనివాస్‌రెడ్డి గురువారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెడ్డి జాగృతిని పటిష్ట పరిచి రెడ్ల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

ఘనంగా పలహార బండి ఊరేగింపు


పలహారబండి ఊరేగింపులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ శారదానగర్ కాలనీలో బర్ల శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలహార బండి ఊరేగింపులో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

ప్రగతిచక్ర అవార్డుల అందజేత


అవార్డులు అందజేస్తున్న సమత

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ డిపోలో గురువారం ఉత్తమ ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులు అందజేశారు. మే, జూన్, జూలై నెలలకు గాను బెస్ట్ ఈపీకే ఎక్స్‌ప్రెస్‌లో ముగ్గురు, బెస్ట్ ఈపీకే ఆర్డీనరికి ముగ్గురు, టీఏవైఎల్ సెల్స్‌పైన ముగ్గురిని అవార్డులకు ఎంపిక చేశారు. మొత్తం 17 మంది ఉద్యోగులకు గురువారం మేనేజర్ సమత అవార్డులు అందజేశారు.

అనాథాశ్రమానికి బియ్యం వితరణ


బియ్యం, కందిపప్పు అందజేసిన విద్యార్థులు

ఎల్‌బీనగర్: కీర్తన అనాథ ఆశ్రమానికి హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని నాగార్జున మాంటిస్సోరీ ఐఐటీ కాన్సెప్ట్ పాఠశాల విద్యార్థులు 8 క్వింటాళ్ల బియ్యం, 50 కిలోల కందిపప్పును వితరణ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో చారిటీ డే సందర్భంగా విద్యార్థుల నుంచి సేకరించిన విరాళలతో పాటు పాఠశాల నుంచి విరాళం అందజేశామన్నారు. అభాగ్యుల పట్ల ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రజినిరెడ్డి, శేషరావు, రాజశేఖర్, పద్మావతి పాల్గొన్నారు.

తవ్వేస్తాం.. ఇష్టమొచ్చినప్పుడు రోడ్డేస్తాం



చైతన్యపురి డివిజన్ సాయినగర్ కాలనీ నుంచి రాఘవ హాస్పిటల్ వరకు నూతన రోడ్డు వేసేందుకు ఉన్న రోడ్డును తవ్వారు. రెండు నెలలు అవుతున్నా ఇంత వరకు సీసీ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. దీంతో తమ తమ ఇళ్లకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

–చైతన్యపురి